క్లుప్తంగా

26న బోనాల జాతర



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్/టేకులపల్లి: తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న శ్రీశ్రీశ్రీ కనకాల కట్ట మైసమ్మ అమ్మవారి బోనాల జాతర కరపత్రాలను శుక్రవారం కొత్తగూడెం, టేకులపల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కుమ్మరి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మల్లెల ఉషారాణి మాట్లాడుతూ... హైదరాబాద్ కనకాల కట్ట మైసమ్మ గుడి లోయర్ ట్యాంక్ బండ్‌లో అత్యంత వైభవంగా బోనాల జాతర జరుగుతుందని, భక్తులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు. ఆమెడ రేణుక, పోరండ్ల రామనర్సయ్య, రమ, ఆమెడ నాగభూషణం, సాంబయ్య, భాస్కర్, ఉమ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఉచితం

ఇల్లెందురూరల్: 2025–26 విద్యా సంవత్సరంలో డిగ్రీ కళాశాలల్లో దోస్త్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా మూడో ఫేజ్ గడువును జూన్ 25వ తేదీ వరకు ఉన్నత విద్యా మండలి పెంచిందని ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాలలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశాల కోసం ఇంకా చాలామంది దోస్త్‌లో ఆన్‌లైన్ చేసుకోలేదన్నారు. పెంచిన గడువు తేదీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలేజీలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఐటీఐ అడ్మిషన్లకు చివరి తేదీ

సింగరేణి(కొత్తగూడెం): 2025–26 విద్యాసంవత్సరానికి కొత్తగూడెంలోని ప్రభుత్వ ఐటీఐల లో వివిధ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న అడ్మిషన్లకు నేటితో గడువు ముగియనుంది. ఆసక్తి గల అభ్యర్థులు ***htppr:iti.telangana.gov.in*** వెబ్‌సైట్‌లో దరఖాస్తు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

స్కూటీల పంపిణీ



స్కూటీలు అందుకుంటున్న లబ్ధిదారులు

పాల్వంచ: తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎస్ఆర్ నిధులతో ముగ్గురు దివ్యాంగులకు స్కూటీలు అందజేశారు. కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య కృషితో జిల్లాలో 70 మందికి స్కూటీలు అందగా.. అందులో పాల్వంచ నుంచి జుర్రిబాబు, సునీత, అమ్మిలకు శుక్రవారం అందజేశారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చండి..

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక ప్రాంతమైన రామవరంలో వర్షాకాలంలో సీజనల్, అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని కొత్తగూడెం మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్‌లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలకవర్గం లేకపోవడంతో అపరిశుభ్రత తాండవిస్తోందని, తక్షణమే అధికారులు పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని కోరారు. సింగరేణి అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

పాల్వంచరూరల్: భూభారతి రెవెన్యూ సదస్సులు శుక్రవారం ముగిశాయి. మండలంలోని రైతులు భూసమస్యల పరిష్కారం కోసం 7,837 దరఖాస్తులు చేసుకున్నట్లు తహసీల్దార్ దారా ప్రసాద్ తెలిపారు.

జూలూరుపాడు: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూ భారతి చట్టం – 2025 ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించేందుకు ఈనెల 3 నుంచి ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు శుక్రవారం ముగిశాయి. చివరిరోజు మాచినేనిపేటతండాలో తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ... 4,690 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో అత్యధికంగా సాదాబైనామా 3,688, మిగిలినవి ఇతర భూ సమస్యలకు సంబంధించినవి ఉన్నట్లు చెప్పారు. దరఖాస్తులు ఇవ్వలేకపోయిన వారి నుంచి తహసీల్‌లో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి పరిశీలన ప్రారంభిస్తామన్నారు.

మారిన విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు

టేకులపల్లి: టేకులపల్లి, బొమ్మనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల అధికారుల మారిన ఫోన్ నంబర్లు.

టేకులపల్లి సబ్‌స్టేషన్ –	8712485887
బోడు సబ్ స్టేషన్ –	8712485889
హట్కర్ దేవా, ఏఈ –	8712485884
శ్యాంబాబు, లైన్ ఇన్‌స్పెక్టర్ –	8712485885
కె.లక్ష్మీనారాయణ, లైన్‌మెన్ –	8712485886
బొమ్మనపల్లి సెక్షన్:	
బొమ్మనపల్లి సబ్ స్టేషన్ –	8712485893
కోయగూడెం సబ్‌స్టేషన్ –	8712485894
బుజ్జి కన్నయ్య, ఏఈ –	8712485890
బి.దేవ్‌సింగ్, లైన్‌మెన్ –	8712485892

భూభారతి న్యాయం చేస్తుందా..?

- అర్హత ఉన్నా అందని పట్టాదారు హక్కులు
- రైతులకు దూరమవుతున్న సంక్షేమ పథకాలు
- అటవీ, రెవెన్యూ సరిహద్దు వివాదమే అసలు సమస్య



పూసపల్లిలో సరిహద్దులు తేలక వివాదాస్పదంగా ఉన్న సాగు భూమి

ఇల్లెందురూరల్: దశాబ్దాలుగా భూసమస్యలతో నలిగిపోతున్న అన్నదాతలకు గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూరికార్డుల శుద్ధీకరణ కూడా పరిష్కారం చూపలేకపోయింది. అటవీ, రెవెన్యూ శాఖల భూములకు స్పష్టమైన సరిహద్దులు లేకపోవడం, పూర్వ ఆధారాలు ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలలో కనుమరుగు కావడం వంటి కారణాలతో వేలాది మంది రైతులు నేటికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు అందుకోలేకపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం తాజాగా రూపొందించిన భూభారతి చట్టమైనా న్యాయం చేస్తుందా అన్న మీమాంసలో ఉన్నారు రైతులు.

మండలంలో భూముల వివరాలు..

గత ప్రభుత్వం ఆదేశంతో క్షేత్రస్థాయి అధికారులు చేపట్టిన సమగ్ర భూరికార్డుల ప్రక్షాళన ద్వారా మండలంలో భూముల వివరాలను అధికారులు నాడు అధికారంగా వెల్లడించారు. మొత్తం 98,677.18 ఎకరాలు, 61,831.16 ఎకరాలు అటవీభూమి, 19,322 ఎకరాలు ప్రభుత్వ భూమి, 17,523.35 ఎకరాలు పట్టాభూమిగా నమోదైంది. ఇదిలా ఉండగా నాడు మండల వ్యాప్తంగా 5,057 మంది రైతులకు 15,057 ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేశారు. రెవెన్యూశాఖ గణాంకాల ప్రకారం ఇంకా 2,466 ఎకరాల విస్తీర్ణంలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంది.

నాడు కాదన్నవారే... నేడు లాగేసుకున్నారు..

మండలంలోని పూసపల్లి గ్రామ సమీపంలో విజయలక్ష్మీనగర్‌కు చెందిన గిరిజనులు సర్వే నంబర్ 588/2 పరిధిలో 7.03 ఎకరాల విస్తీర్ణంలో దశాబ్దాలుగా పంటలు సాగు చేస్తున్నారు. అటవీభూమిగా పేర్కొంటూ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ భూమిగా పేర్కొంటూ అటవీ శాఖ అధికారులు పట్టాల మంజూరుకు నిరాకరించారు. కానీ ఇటీవల రెవెన్యూ అధికారులు సదరు భూమిపై రైతులకు నోటీసులిచ్చి స్వాధీనం చేసుకున్నారు. మండలంలో పట్టాదారు పాస్‌పుస్తకాల మంజూరులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఈ సమస్యే ప్రత్యక్ష ఉదాహరణ.

అస్పష్ట సరిహద్దులే అసలు సమస్య...

మండలంలో అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు సమస్య రైతుల పాలిట శాపంగా పరిణమిస్తోంది. గతంలో భూరికార్డుల శుద్ధీకరణ సమయంలో సర్వే చేసిన అధికారులు సైతం సరిహద్దులపై స్పష్టత ఇవ్వలేకపోయారు. ఫలితంగా రైతులు అర్హత ఉన్నా పట్టాలను పొందలేకపోయారు. రాఘుబోయినగూడెం పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 131లో ఉన్న నాలుగువేల ఎకరాలలో అత్యధిక భాగంలోని భూమిపై అటవీ, రెవెన్యూ అధికారులకు స్పష్టత కొరవడింది. దీంతో సర్వే సమయంలో కేవలం 800 ఎకరాలకు మాత్రమే పాస్‌పుస్తకాలు అందజేశారు. రొంపేడు పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 588లో మొత్తం 22వేల ఎకరాలు ఉండగా అందులో అటవీ భూమి 14వేల ఎకరాలు, సింగరేణికి సంబంధించి 165 ఎకరాలు, మిగతాది రెవెన్యూ భూమిగా నమోదైంది. కానీ సరిహద్దులలో స్పష్టత లేకున్నా అటవీభూమిగా నిర్ధారించి గతంలో అధికారులు మంజూరు చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలను రద్దు చేశారు. ఇదే తరహాలో కొమరారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 320, రాజీవ్‌నగర్ సమీపంలోని సర్వే నంబర్ 549లోనూ రైతులు నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

భూభారతిపైనే రైతుల ఆశలు...

మండలంలో దశాబ్దాలుగా సాగులో ఉన్న గిరిజనేతర రైతులకు గతంలో పాలకులు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేశారు. కానీ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూరికార్డుల శుద్ధీకరణ సమయంలో కాస్తుకాలం తొలగించడం వల్ల భూమి ఎలా సంక్రమించింది.. ఎప్పుడు కొనుగోలు చేశారు.. వంటి ఆధారాలు చూపాలని గిరిజనేతరులను అధికారులు ప్రశ్నించారు. కానీ పలు గ్రామాలలో జరిగిన ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలతో ఆధారాలు లేకపోవడం, అవగాహన లేక కొనుగోలు సమయంలో దస్త్రాలను రాసుకోకపోవడం వంటి కారణాలతో అనేక మంది రైతులు ఆధారాలు చూపలేదు. దీంతో వారికి పట్టాదారు పాస్‌పుస్తకాల మంజూరుకు అధికారులు నిరాకరించారు. ఇటువంటి పరిస్థితిలో తాజాగా రూపొందించిన భూభారతి చట్టమైనా తమకు న్యాయం చేస్తుందా అని అర్హులైన గిరిజనేతర రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం...



1970కి పూర్వం ప్రమాదవశాత్తు ఊరు కాలిపోవడంతో ఇంట్లో ఉన్న దస్త్రాలు కూడా కాలిపోయాయి. అయినా నాటి పాలకులు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేశారు. కానీ ఆధారాలు లేవన్న కారణంతో గత ప్రభుత్వం పట్టాదారు పాస్‌పుస్తకాల మంజూరుకు నిరాకరించింది. ప్రస్తుతం భూభారతి చట్టం తమలాంటి వారికి న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాం.

– మంచె కృష్ణయ్య, రైతు, కొమరారం

బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: ఇల్లెందు జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో శనివారం జరగనున్న కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి పరిశీలించారు. శుక్రవారం కాంగ్రెస్ పట్టణ కమిటీ నేతలతో కలిసి ఆయన సభా ఏర్పాట్లు పరిశీలించారు. లైటింగ్, సౌండ్, వేదిక, కుర్చీలు ఏర్పాట్లను పరిశీలించారు. సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య వెంట డీఎస్పీ ఎన్.చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, శివకుమార్, ఎరసంగి వెంకన్న, సైదామియా పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం గుండాల, బయ్యారం మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు గుండాల మండలంలో, 2.45 గంటలకు బయ్యారం మండలంలో, సాయంత్రం 5.15 గంటలకు ఇల్లెందు సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ సభలో పాల్గొననున్నారు.

23 నుంచి ప్రత్యేక గ్రామసభలు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని గ్రామాలలో నిర్వహించే గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అనిశెట్టిపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఐదు గ్రామాలలో కార్యక్రమాలు చేపట్టడానికి నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఆధార్‌కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, జన్‌ధన్ అకౌంట్లు, కుల ధృవీకరణ పత్రాలు, కిసాన్ సమృద్ధి యోజన, మాతృవందనం, ఓటర్ గుర్తింపు కార్డులు, ఎఫ్ఆర్ఏ పట్టాలు, రేషన్ కార్డులు, ఉపాధి హామీ జాబ్ కార్డులు వంటి లేకపోతే షెడ్యూల్ ప్రకారం జరిగే గ్రామ క్యాంపులలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 23, 24న మైలారం, 26న బంగారుచెలక, 28న రేగళ్లలో క్యాంపులు జరుగుతాయని వివరించారు.

జూలూరుపాడు: భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 26 వరకు ధర్తి ఆబా జన్ భగీదరి అభియాన్ కార్యక్రమంపై గిరిజనులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు జూలూరుపాడు ఎంపీడీఓ డి.కరుణాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 23న భేతాళపాడు, 24న కరివారిగూడెం, 26న మాచినేనిపేటలలో ప్రత్యేక గ్రామసభలు జరగున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఓటు హక్కు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, కిసాన్ క్రెడిట్ కార్డు, కిసాన్ సమ్మాన్ నిధి యోజన, ఆయూష్మాన్ భారత్, మాతృవందన, ఎఫ్ఆర్ఏ పట్టాలు, ఉపాధి హామీ పథకం, జన్‌ధన్ పథకాలకు అర్హత ఉండి పథకాలు అమలు కానివారు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రత్యేక గ్రామసభలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వి నియోగం చేసుకోవాలని ఎంపీఓ చిరంజీవి అన్నా రు. మామిడిగుండాల గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన లేకపోవడంతో చాలామంది వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. అనంతరం పలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యదర్శి ఈర్ల లక్ష్మీనారాయణ, సెర్ప్ సీసీ నాగేంద్ర పాల్గొన్నారు.

దేశాన్ని విశ్వగురువుగా నిలిపిన మోదీ



మాట్లాడుతున్న విద్యాసాగర్

చుంచుపల్లి: కేంద్రప్రభుత్వ పాలనపై శుక్రవారం కొత్తగూడెం పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ కన్వీనర్ టి.నరేంద్రబాబు హాజరయ్యారు. మాట్లాడుతూ... 11 ఏళ్ల నరేంద్ర మోదీ పాలనలో ఎన్నో అద్భుతాలు చేశారన్నారు. మేక్ ఇన్ ఇండియా, ఆయుష్మాన్ భారత్, ఉచిత రేషన్, కరోనా సమయంలో భారత పౌరులందరికీ ఉచిత వ్యాక్సిన్, బేటీ పడావో బేటీ బచావో, స్టాండ్ ఆఫ్ ఇండియా వంటి పథకాలతో భారతదేశాన్ని అగ్రస్థానంలో తీసుకెళ్తున్నారని చెప్పారు. విద్యాసాగర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్తగూడెం పట్టణం పూర్తిగా వెనుకబడిన ప్రాంతంగా మారిందని, స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర సమస్యలపై మాట్లాడుతున్నారే తప్ప స్థానిక సమస్యలపై మాట్లాడడం లేదన్నారు. నోముల రమేష్, గూడ విజయ, జీవీకే శివ, గొడుగు శ్రీధర్ యాదవ్, గుంపుల మహేష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అక్రమార్కులకు పట్టాలు ఇవ్వొద్దు..



పాల్వంచరూరల్: తహసీలార్దుకు వినతిపత్రం అందజేస్తున్న కూలీలు

పాల్వంచరూరల్: భూ అక్రమార్కులకు భూమి హక్కు పట్టాలు ఇవ్వొద్దని తెలంగాణ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ దారా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి పున్నంచంద్ మాట్లాడుతూ... పాండురంగాపురంలో సర్వే నంబర్ 126/151, 126/152, 126/162, 126/11 భూముల్లో భూఅక్రమార్కులు కొంతమంది భూ భారతిలో పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారని వాటిని తిరస్కరించి నిజమైన సాగుదారులకు, పేదప్రజలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాలుగా 167మంది ఆదివాసీలు భూములను చదును చేసుకుని సాగు చేస్తుంటే కొంతమంది ఆ భూములకు దొడ్డిదారిన హక్కులు పొందాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గోపమ్మ, కుంజ సోమక్క, తోలెం మమత, గౌతమి, ధనమ్మ, డి.పూజిత, నర్సింహారావు, రాంబాబు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి..

జూలూరుపాడు: రైతుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు లకావత్ గిరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మాచినేనిపేటతండాలో రెవెన్యూ సదస్సులో డీటీ నాగరాజుకు రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

సమాజమార్పుకు కళలు దోహదపడతాయి..



మాట్లాడుతున్న మోహన్‌రావు

ఇల్లెందు: సమాజంలో వివిధ ఆధిపత్య భావజాలం ద్వారా సమాజంపై దాడి జరుగుతోందని ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ సాంస్కృతిక పోరాటం అవసరం అని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే) మండల నాయకులు మన్యం మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో వ్యక్తివాదం, వినిమయవాదం, మానవ సంబంధాలతో సర్వం సరుకుగా మారుతోందని, కులం, మతం, భాష, సాహిత్యం, కళలు, ఆచారాలు, అలవాట్లు, కట్టుబాట్లు, సంప్రదాయలపై ఆధిపత్య భావజాలం దాడి జరుగుతోందని దానిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం టీపీఎస్‌కే మండల అధ్యక్ష, కార్యదర్శులు వజ్జా సురేష్, మోహన్‌రావులతో పాటు 19 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలేటి కిరణ్, కృష్ణ, పద్మ, సంతోష, కాంతమ్మ, వీరయ్య, వీరభద్రం, భిక్షం, శంకర్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు మున్సిపాలిటీలో ఫ్రైడే డ్రైడే

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో పలు వార్డుల్లో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆయా వార్డుల్లో మెప్మా యంత్రాంగం ఇంటింటికీ వెళ్లి ఇళ్లల్లో నీటి తొట్లు, గాబులు, కుండల్లో నిల్వ ఉన్న నీటిని పారపోసి పరిశుభ్రత గురించి వివరించారు.. ఈ కార్యక్రమంలో మెప్మా పట్టణ కోఆర్డినేటర్ నాగయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లాల్యా, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అతహర్, మెప్మా సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

కార్మికులను దొడ్డిదారిన తీసుకరావొద్దు



బంగ్లోస్ వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సివిల్ అధికారులు అక్రమ పద్ధతుల్లో దొడ్డిదారిన పోటీ కార్మికులను తీసుకరావటం మానుకోవాలని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని బంగ్లోస్ వద్ద పోటీ కార్మికులతో పనులు చేయించడాన్ని కాంట్రాక్ట్ కార్మికులు అడ్డుకొని ఆందోళన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ... సింగరేణి సివిల్ అధికారులు.. సివిల్ కాంట్రాక్ట్ కార్మికులను ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి పనులు చేయిండం సరైంది కాదన్నారు. ఈ విషయమై తమ యూనియన్ అధికారులు వినతిపత్రం సమర్పించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకోవాలని లేదంటే మూల్యం చెల్లించకతప్పదన్నారు.

పాతవారికే అవకాశం కల్పించండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే–7 ఓసీ ఓబీలో పాతవారికే అవకాశం కల్పించాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజును కాంట్రాక్ట్ జేఏసీ నాయకులు కోరారు. శుక్రవారం ఏరియా జీఎం కార్యాలయంలో జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సుమారు 600 మంది నాలుగైదు ఏళ్లుగా ఓసీలో పనికోసం వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారని, వారిని కాదని ఓబీ ప్రైవేట్ కంపెనీవారు రిక్రూట్‌మెంట్ చేయటం సరికాదని వాటిని వెంటనే నిలిపివేయాలని కోరారు. స్పందించిన జీఎం నిబంధనల మేరకు లోకల్ 80శాతం, నాన్‌లోకల్ వారికి 20శాతం తీసుకోవాలని చెప్పారు. పాతవారికి అన్యాయం జరగనివ్వమని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నెమిళ్ల సంజీవ్, మోహన్, రవి, ఆంజనేయులు, రవిగౌడ్, యాకయ్య, వాసు, శరత్, రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, బిల్ కలెక్టర్లు, సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కరించాలని టీఆర్‌వీకేఎస్ నాయకులు కోరారు. శుక్రవారం హన్మకొండలోని విద్యుత్ భవన్‌లో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆర్టిజన్ల గ్రేడ్‌లను మార్పు చేయాలని, ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు రావాల్సిన డీఏ, డీఆర్‌ను విడుదల చేయాలని, కంపెనీ పరిధిలో జనరల్ ట్రాన్స్‌ఫర్లు చేపట్టాలని, జేఎల్ఎం నియామకం కోసం నోటిఫికేషన్ వేయాలని, బిల్ కలెక్టర్లు, సెక్యూరిటీ గార్డుల వేతనాలు పెంచాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎండీ నెల రోజుల్లోగా సమస్యలు పరిష్కారించేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కోడూరి ప్రకాష్, జాన్సన్, చారుగుండ్ల రమేష్, గోపాలరావు, నరేంద్రపాల్ ఉన్నారు.

వసతులు కల్పించండి..

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేయాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజు దోడిని అరికట్టాలని కోరుతూ శుక్రవారం జూలూరుపాడు ఎంఈఓ బానోత్ జుంకీలాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పునీత్ కుమార్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



చెస్ టీమ్‌ను అభినందిస్తున్న కిరణ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా ఇంటర్ కంపెనీ చెస్ టోర్నమెంట్‌లో టీమ్ చాంపియన్‌షిప్ సాధించిన టీమ్ మేనేజర్ కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, కోలిండియా స్థాయిలో శివకుమార్, కే.రామ్‌లక్ష్మణ్‌రెడ్డిలను జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ సీఎస్సార్) జీవీ కిరణ్‌కుమార్ శుక్రవారం తన చాంబర్‌లో అభినందించారు. వారికి ట్రోఫీ, ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో డీజీఎం నారాయణరావు, శివకేశవరావు, ముకుంత సత్యనారాయణ, టి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ముగిసిన బడిబాట

- ప్రభుత్వ బడుల్లో పెరిగిన ప్రవేశాలు
- కొత్తగా 133 మంది విద్యార్థుల చేరిక
- మండలంలో 26 ప్రభుత్వ పాఠశాలలు

చుంచుపల్లి: బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉండాలి. మధ్యలో చదువు మానేసిన వారిని తిరిగి పాఠశాలలకు రప్పించాలి. ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య అందుతున్న విషయాలను తల్లిదండ్రులకు చేరవేయాలి. ఇది ఈ ఏడాది పాఠశాలల పునః ప్రారంభానికి ముందు చేపట్టిన బడిబాట లక్ష్యం. అయితే దీని కనుగుణంగా విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషి కొంతవరకు ఫలించింది. ప్రైవేటు పాఠశాలల నుంచి పిల్లలను ప్రభుత్వ బడులకు రప్పించాలన్న లక్ష్యాన్ని సైతం కొద్దిమేర చేరుకోవడం గమనార్హం.

14 రోజుల పాటు అవగాహన..

చుంచుపల్లి మండల పరిధిలో మొత్తం 26 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో నాలుగు ఉన్నత, రెండు ప్రాథమికోన్నత, 20 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. వీటిల్లో ప్రస్తుతానికి ఈ రోజు వరకు 1,600 మంది పిల్లలు 1వ తరగతి నుంచి పదివరకు చదువుతున్నారు. ఈ నెల 12 నుంచి వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ బడులు తెరుచుకున్న విషయం తెలిసిందే. అయితే దీనికి ముందే ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో బడిబాట కార్యక్రమాన్ని ఈనెల 6న ప్రారంభించగా గురువారంతో ముగిసింది. ఈ 14 రోజులు ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పరిధిలో ఇంటింటికీ తిరిగి చదువు ప్రాధాన్యత.. ప్రభుత్వ బడుల్లో అందుబాటులోకి వచ్చిన నాణ్యమైన విద్యా బోధన, ఉపాధ్యాయుల సంఖ్య, పిల్లలకు అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, కల్పిస్తున్న వసతులు, సాధించిన ఫలితాలు తదితరాలను వివరించారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తూ బడిఈడు పిల్లలు.. గతేడాది మధ్యలో చదువు మానేసిన వారందరిని పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా డిజిటల్ లెర్నింగ్‌పై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలంలో బడిబాట మొదటిరోజు నుంచే పాఠశాలల్లో ప్రవేశాలు ప్రారంభించారు. గతేడాది కంటే ఈసారి ప్రవేశాలు పెంచాలన్న ఉద్దేశంతో మధ్యలో బడి మానేసిన పిల్లలతో పాటు ప్రైవేటు పాఠశాల విద్యార్థులే లక్ష్యంగా కృషి చేశారు. మండల వ్యాప్తంగా బడిబాట ద్వారా ఈ సారి 133 మంది విద్యార్థులు కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. గతేడాది అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1,400 లోపు మాత్రమే విద్యార్థులు ఉండేవారు. ఆగస్టు వరకు ఇంకా ప్రవేశాలు కొనసాగుతాయని తద్వారా మరింత మంది చేరే అవకాశం ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి..

చుంచుపల్లి మండలంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ఫోన్‌తో వాట్సాప్ గ్రూప్‌ని ఏర్పాటు చేసి ప్రతీరోజు విద్యార్థులకు హోంవర్క్‌ను పంపించి తల్లిదండ్రులకు ఫోన్ చేసి సాయంత్రం పూట హోంవర్క్ చేసే విధంగా ప్రోత్సహిస్తున్నారు. బడికి రాని విద్యార్థులకు వారి ఇంటికి వెళ్లి తీసుకురావటం, లేదా ఫోన్ ద్వారా కారణాలు తెలుసుకోవడం దీనివలన పిల్లల హాజరు శాతం పెంచగలుగుతున్నారు.



బడిబాట కార్యక్రమంలో ఎంఈఓ, ఉపాధ్యాయులు (ఫైల్)

ప్రతీరోజు సాయంత్రం హోంవర్క్ చేయించడం, ఆటలు ఆడించడం, లైబ్రరీలో పుస్తకాలు చదివించడం వంటివి నిర్వహిస్తున్నారు. గతేడాది పదో తరగతి ఫలితాల్లో 92 శాతంతో ముందంజలో ఉండటమే కాకుండా మండలంలో అత్యధికంగా 541 మార్కులు సాధించగలిగారు. హైస్కూల్ ఉదయం, సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహించటమే కాకుండా సెలవుదినాల్లో పాఠశాల నడిపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇదే ఒరవడితో ఈ సంవత్సరం కూడా మంచి ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

బడిబాట విజయవంతం



మండలంలోని 26 ప్రభుత్వ పాఠశాలల పరిధిలో ఈ నెల 6 నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాం. గ్రామాల్లో బడి మానేసిన విద్యార్థులతో పాటు కొత్తగా చేరే వారికి అవగాహన కల్పించాం. దాదాపు 133 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో కొత్తగా చేరారు. బడిబాట విజయవంతం చేయటంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంది. ఈసారి కూడా ఉత్తమ ఫలితాలను సాధించేందుకు మరింత ఉత్సాహంగా పనిచేస్తాం.

– బానోత్ బాలాజీ, ఎంఈఓ